మంచు.. మసకేసిందిలే..

ప్రతి రోజూ ఉదయం సూరీడుని ఏం చూస్తారు.. నన్ను చూడండి అంటూ మంచుదుప్పటి కప్పేసింది.. పల్లెలు.. పట్టణాలను తన ఒడిలో దాచుకుంది.. శుక్రవారం ఉదయం 10 గంటలైనా వెలుతురు కానరాలేదు.. మంచు కప్పేసింది.. కాసేపటికి కలలా మంచు కరిగిపోయింది.. అంతే సూరీడు మెల్లమెల్లగా సూరీడు బయటకు వచ్చి వెలుగును ప్రసరింపజేశాడు.. ఇటువంటి వాతావరణం చూసి చాలాకాలం కాలం కావడంతో గోదావరి జిల్లాల్లో జనం పులకించిపోయారు.. ష్నోయగాన్ని మనసారా ఆస్వాదించారు.. ఉదయం వాహనాలపై వెళ్లేవారు మాత్రం కాస్త ఇబ్బందులకు గురయ్యారు.

6



కాకినాడ నగరంలో ముత్తా గోపాలకృష్ణ వారధిపై తెల్లవారుతుండగా మంచు దుప్పటి



కాకినాడలో తెల్లవారుజామున రహదారిపై కురుస్తున్న మంచు

బెండపూడి విద్యార్థికి.. గవర్నర్ ఎట్‌హోంకు ఆహ్వానం 7

ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు ప్రారంభం 6

మీతోనే!



సభ్యత్వంలోనూ చరిత్ర లిఖించెన్

- టీడీపీ వెంటే లక్షలాదిగా జనం
- సభ్యత్వ నమోదులో రికార్డు
- ఓటర్లు 45.16 లక్షలు
- టీడీపీ సభ్యులు 9.97 లక్షలు
- నియోజకవర్గానికి 50 వేలు
- గత రికార్డులు బద్దలు
- ఉత్సాహంగా టీడీపీ కేడర్
- ఉమ్మడి జిల్లాలో సైకిల్ జోరు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సైకిల్ జోరు.. హుషారు.. తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదులో ముందెన్నడూ లేని రీతిలో చరిత్ర సృష్టించింది. నియోజకవర్గాల వారీగా అత్యధిక పార్టీ సభ్యత్వాల నమోదును పూర్తిచేసింది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వాలను జోరుగా హుషారుగా చేపట్టి పూర్తి చేయడంతో పార్టీ వర్గాల్లో నూతనోత్తేజం నెలకొంది. గతంలో ఉన్న రికార్డులను సైతం బద్దలుకొట్టింది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ల్లోని 21 నియోజకవర్గాల్లో మొత్తం 45.16 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో రికార్డు స్థాయిలో 9.97 లక్షల మంది తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు చేయించుకున్నారు. టీడీపీ సభ్యత్వ నమోదులో ప్రవేశ పెట్టిన వినూత్న మార్పులు, ప్రమాద బీమా వంటి అంశాలపై ఈసారి ప్రజల్లోను, పార్టీ వర్గాల్లోను చైతన్యం పెరిగింది. దాంతో సభ్యత్వ నమోదులో గతం కంటే భిన్నంగా సభ్యులు మరింత ఉత్సాహంగా సభ్యత్వాలు నమోదు చేయించుకున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో అత్యధికంగా ఏడు నియోజకవర్గాలు కలిగిన తూర్పుగోదావరి జిల్లాలో 13.93 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 3.75 లక్షల మంది సభ్యత్వాలను పొంది ప్రథమస్థానంలో నిలిచారు. కోనసీమ జిల్లా ఏడు నియోజకవర్గాల పరిధిలో 15.12 లక్షల మంది ఓటర్లు ఉండగా 3.27 లక్షల మంది సభ్యత్వం నమోదు చేసుకుని ద్వితీయస్థానంలో ఉన్నారు. కాకినాడ జిల్లా ఏడు నియోజకవర్గాల్లో 16.10 లక్షల మంది ఓటర్లు ఉండగా 2.94 లక్షల మంది టీడీపీ సభ్యత్వం పొంది తృతీయ స్థానంలో నిలిచారు.

కోనసీమలో మండపేట టాప్..

కోనసీమ జిల్లా పరిధిలో అత్యధికంగా మండపేట నియోజకవర్గ పరిధిలో 2.16 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 57,765 మంది అత్యధికంగా టీడీపీ సభ్యత్వం తీసుకుని జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచారు. అయితే ఇక్కడ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిని నియమించక పోవడంతో పార్టీ సభ్యత్వ నమోదులో కొంచెం వెనుకబడ్డారు. ఇక కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రాతినిధ్యం వహించే రామచంద్రపురం నియోజకవర్గంలో లక్షా 99 వేల మంది ఓటర్లు ఉండగా వారిలో 57,442 మంది టీడీపీ సభ్యులుగా చేరి ద్వితీయస్థానం పొందారు. చివరి స్థానంలో రాజోలు రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గం లక్షా 94 వేల మంది ఓటర్లు ఉండగా 22,414 మంది సభ్యత్వం తీసుకున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో 2.49 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 56,520 మంది, అమలాపురం రిజర్వుడు నియోజకవర్గంలో 2.11 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 52,509 మంది, ముమ్మిడివరం నియోజకవర్గంలో 2.42 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 45,674 మంది, పి.గన్నవరం నియోజకవర్గంలో లక్షా 96 వేల మంది ఓటర్లు ఉండగా 34,843 మంది టీడీపీ సభ్యులుగా సభ్యత్వం పొందారు.

కాకినాడ జిల్లాలో ఇలా..

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో అత్యధికంగా 53,915 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. కాకినాడ సిటీ 46,194, తుని 44,592, ప్రత్తిపాడు 43,370, పెద్దాపురం 40,655, జగ్గంపేట 34,681, పిఠాపురం 31,375 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ డిప్యూటీ సీఎం హోదాలో కొనసాగుతున్నారు.

తూర్పున... 'గోపాలపురం'

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలో టీడీపీ బలం పెరిగింది. పార్టీ సభ్యత్వ నమోదు రికార్డు స్థాయిలో జరిగింది. గోపాలపురం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం లక్ష్యాన్ని మించి రికార్డు సాధించింది. జిల్లాలో మొత్తం 4.30 లక్షల మందిని చేర్పించాలని లక్ష్యం కాగా మొత్తం 3 లక్షల 62 వేల 634 మంది సభ్యులుగా చేరారు. రెన్యువల్ చేయించుకున్న వారు 1,44,773 మంది, కొత్తవాళ్లు 2,17,861 మంది ఉన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో 60 వేలు సభ్యత్వ నమోదు లక్ష్యం కాగా మరో 4,375 అదనంగా చేసి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు 107.29 శాతం సాధించారు. రెండో స్థానంలో అనపర్తి నిలిచింది. లక్ష్యం 55 వేలు కాగా 52,787 మంది 95.98 శాతం సభ్యులుగా చేరారు. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉన్న సంగతి తెలిసిందే. ఆయన కుమారుడు ఎన్.మనోజ్‌రెడ్డి టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నారు. కొవ్వూరు మూడో స్థానంలో నిలిచింది. 60 వేల సభ్యత్వం లక్ష్యం కాగా 51,851 అంటే 86.42 శాతం మందిని చేర్పించారు. ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావు, పారిశ్రామికవేత్త పెండ్యాల అచ్చిబాబు, ద్విసభ్య కమిటీ సభ్యులు సభ్యత్వ నమోదుపై దృష్టి సారించారు. రాజానగరంలో 79.67 శాతం జరిగింది. రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు జరిగింది. లక్ష్యం 55 వేలు కాగా 43,820 మందిని చేర్పించారు. నిడదవోలులో 78.33 శాతం జరిగింది. లక్ష్యం 55 వేలు కాగా మాజీ ఎమ్మెల్యే శేషారావు 43,079 మందిని చేర్పించారు. రాజమహేంద్రవరం రూరల్‌లో 75 వేలు లక్ష్యం కాగా 55,485 మందిని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో చేర్పించారు. రాజమహేంద్రవరం సిటీలో 70 వేల సభ్యత్వాలు లక్ష్యం కాగా 51,237 మందిని చేర్పించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు ఆధ్వర్యంలో 73.98 శాతం సభ్యత్వ నమోదు జరిగింది.

భూ బెంగలేదిక

- జిల్లాలో భూ రీసర్వే ప్రక్రియను మొదలుపెట్టిన కూటమి ప్రభుత్వం
- తొలి విడత 15మండలాల్లో 15 గ్రామాల ఎంపిక : ఆ తర్వాత మిగిలిన గ్రామాల్లో..
- ప్రస్తుతం 103 బృందాలతో 27,013 ఎకరాల ప్రైవేటు,పట్టా భూముల్లో సర్వే
- భూ యజమానులకు నోటీసులిచ్చి వారి సమక్షంలోనే సర్వే ప్రక్రియ

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో భూముల రీసర్వేకు రంగం సిద్ధమైంది. అత్యంత పారదర్శకంగా, తప్పులు లేకుండా అడ్డగోలుతనం, అరాచకాలకు తావులేకుండా రీసర్వే ప్రక్రియను కూటమి ప్రభుత్వం ప్రారంభించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏమాత్రం బాధ్యత లేకుండా భూయజమానులతో సంబంధం లేకుండా అస్తవ్యస్తంగా రీసర్వే ప్రక్రియ జరిగింది. ఏకంగా విస్తీర్ణాలే తారుమారు చేసేసి, ఒకరి భూమిని ఇంకొకరి ఖాతాల్లో వేసేసి లెక్కలేనన్ని భూవివాదాలు సృష్టించింది. వెరసి భూ రీసర్వే పేరుతో పచ్చని పల్లెల్లో ప్రజల మధ్య అనేక గొడవలు తగాదాలు సృష్టించింది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం గత తప్పిదాలేవీ పునరావృతం కాకుండా పక్కాగా భూయజమానుల సమక్షంలో రీసర్వేను ప్రారంభించింది. ఇందులోభాగంగా జిల్లాలో 15 మండలాల్లో 15గ్రామాలను ఎంపిక చేసింది. ఈ గ్రామాల పరిధిలో ప్రైవేటు, పట్టా భూములు కలిపి 27వేల ఎకరాల ఉండగా, వీటిని అధికారులు సర్వే చేయనున్నారు. ఆతర్వాత మిగిలిన గ్రామాల్లో సర్వే పూర్తిచేయనున్నారు.

రీసర్వే పేరుతో అప్పట్లో అరాచకం

జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేటు భూముల సర్వే 1920లో జరిగింది. దీని ప్రకారమే ఇప్పటికీ భూ క్రయవిక్రయ లావాదేవీలు జరుగుతున్నాయి. వాస్తవానికి 1920లో జరిగిన భూసర్వే 30 ఏళ్ల పాటు మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలి. ఆ తర్వాత మళ్లీ భూ రీసర్వే జరగాలి. కానీ అనేక కారణాలతో ఇప్పటివరకు ఆ సర్వే జరగలేదు. దీంతో ప్రభుత్వ,ప్రైవేటు భూమి ఏదైనా సరే వివాదం తలెత్తితే 1920 నాటి రీ సర్వే రిజిస్టర్ (ఆర్ఎస్ఆర్) మాత్రమే రెవెన్యూశాఖకు ప్రామాణికం. ఈ వందేళ్లలో అనేక భూములు వ్యవసాయేతర భూములుగాను, వాణిజ్యప్రాంతాలుగాను మారిపోయాయి. కానీ ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం వీటికి సంబంధించిన మార్పులు చోటు చేసుకోకుండా వందేళ్ల కిందట అప్పటి స్థితిగతుల ప్రకారమే కొనసాగుతున్నాయి. ఎక్కడైనా వందెకరాల భూమి ఉంటే దానికి ఏకమొత్తంగా ఒకే సర్వే నెంబర్ మాత్రమే కొనసాగుతోంది. పైగా ఈ సర్వే నెంబర్ పరిధిలో యాభై,అరవై మందికి సొంతంగా చిన్న ముక్కలుగా భూమి ఉంటుంది. వీరు క్రయవిక్రయాలు జరిపితే ఒకే సర్వే నెంబరే అందరికీ ప్రామాణికంగా కొనసాగుతోంది. దీనివల్ల అనేక భూ వివాదాలు తలెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో వందేళ్ల తర్వాత గత వైసీపీ ప్రభుత్వం సర్వేశాఖ ద్వారా సమగ్ర భూ సర్వే చేయడానికి కసరత్తు జరిపింది. జిల్లాలో ప్రతి మండలంలోని మొత్తం గ్రామాల్లోని కార్స్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అధికారులు ఈసర్వేకు శ్రీకారం చుట్టారు. ఒక్కో సర్వే నెంబర్‌లో ఎంతమందికి భూములున్నాయనేది గుర్తించి ఆ సర్వే నెంబర్‌లో ఉన్న వారందరికీ కొత్తగా సబ్‌డివిజన్ చేసి ప్రతిఒక్కరికీ ఉమ్మడిగా ఇంతకాలంగాఉన్న సర్వే నెంబర్ స్థానంలో సబ్‌డివిజన్ సర్వే నెంబర్ కొత్తగా కేటాయించడానికి రంగంలోకి దిగారు. కానీ అప్పటి ప్రభుత్వ బాధ్యతా రాహిత్యం కారణంగా ఈ ప్రక్రియ పూర్తిగా వివాదాలమయంగా మారింది. సర్వేను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం విపరీతమైన ఒత్తిళ్లు తేవడంతో రెవెన్యూసర్వేశాఖ అధికారులు అస్తవ్యస్తంగా ఈ ప్రక్రియను మార్చేశారు. పైగా ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలు అమలు చేసి భూయజమానులు లేకపోయినా సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని ఒత్తిడి తెచ్చింది. దీంతో ఏమాత్రం జవాబుదారీతనం లేకుండా ఈప్రక్రియను జిల్లాలో 296గ్రామాల్లో పూర్తి చేశారు. ఈక్రమంలో భూయజమానులు ఎక్కడ ఉన్నా వారి సమక్షంలో రీసర్వే జరపాల్సి ఉండగా, అదేదీ చేయకుండా పక్క స్థలాల యజమానులను అడిగి రీసర్వే చేసేశారు. భూముల విస్తీర్ణాలను అసలు యజమానికి బదులు పక్కభూముల యజమానుల్లో కలిపేశారు. దీంతో వేలాదిమంది భూయజమానుల భూముల విస్తీర్ణం చాలా వరకు తగ్గిపోయింది. మరికొందరి విస్తీర్ణం అమాంతం పెరిగిపోయింది. అటు రీసర్వేలో తప్పులతో భూయజమానుల పేర్లు సైతం మారిపోయాయి. విషయం తెలిసి భూయజమానులు మొత్తుకున్నా గత ప్రభు త్వం కనీసం పట్టించుకోలేదు. దీంతో న్యాయం కోసం 9వేలమంది భూ బాధితులు కాళ్లరిగేలా తిరిగినా ఎవరూ ఖాతరు చేయని పరిస్థితి. దీంతో గత వైసీపీ ప్రభుత్వ రీసర్వే విధానంతో నష్టపోయిన వేలాదిమంది బాధితులు తీవ్ర ఆగ్రహావేశాలతో ఎన్నికల్లో వైసీపీకి బుద్ధిచెప్పారు.

కూటమి ప్రభుత్వం రాగానే..

వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకంపై విసిగెత్తిపోయిన బాధితులు కూటమి ప్రభుత్వం రాగానే పోటెత్తారు. జిల్లావ్యాప్తంగా 11వేల మంది తమ భూసమస్యలపై ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందించారు. ఇందులో 9వేల మంది అప్పటి భూరీసర్వేతో తీవ్రంగా నష్టపోయామని, సరిహద్దులు మారిపోయాయని విన్నవించారు.ఈనేపథ్యంలో వీటిపై తాజాగా ప్రభుత్వం దృష్టి సారించింది. అప్పట్లో రీసర్వే పూర్తయిన గ్రామాలు పోను ఇంకా జిల్లాలో 30 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాల్సి ఉంది. ఈనేపథ్యంలో తాజాగా తొలివిడత కింద 15 మండలాల్లోని 15 గ్రామాలను ఎంపిక చేసి అధికారులు రీసర్వే ప్రక్రియను ప్రారంభించారు. ఇందుకోసం 103 బృందాలను నియమించారు. సర్వేయర్లు ఆయా గ్రామాల వారీగా ప్రైవేటు, పట్టా భూముల వద్దకు వెళ్లి సర్వే చేయనున్నారు. తొలి విడత ఎంపిక చేసిన 15 మండలాల్లో సామర్లకోట మండలంలోని వేట్లపాలెంలో 14 బృందాలు, కాజులూరులోని కోలంక 11, పిఠాపురంలోని కుమారపురం 4, తాళ్లరేవులోని పటవల 12, గండేపల్లిలోని ఎల్లమిల్లి 10, జగ్గంపేట మండలంలోని జె.కొత్తూరు 3, కిర్లంపూడిలో ఎస్.తిమ్మాపురం 4, కోటనందూరులోని బొద్దవరం 4, పెద్దాపురంలోని కట్టమూరు 9, ప్రత్తిపాడులోని పి.జగన్నాథపురం, రౌతులపూడిలోని ఆర్.వెంకటపురం 2, శంఖవరంలో శంఖవరం 9, తొండంగిలో కృష్ణాపురం 7, తునిలో తాళ్లూరు 5, ఏలేశ్వరంలో భద్రవరంలో నాలుగు చొప్పున సర్వే బృందాలు ప్రైవేటు,పట్టా భూములను కలిపి 27వేల ఎకరాల వరకు సర్వే చేయనున్నారు. ఈక్రమంలో సంబంధిత భూ యజమానులకు ముందే సమాచారం ఇచ్చి సర్వే చేపట్టనున్నారు. ఒకవేళ అందుబాటులో లేకపోతే వాయిదావేస్తారు. రెండుసార్లు అందుబాటులోకి రాకపోతే ఆ తర్వాత వీడియోకాల్ ద్వారా సర్వే చేయనున్నారు. భూయజమాని సమక్షంలోనే రీసర్వే పక్కాగా చేపట్టనున్నారు. ఇది పూర్తయిన తర్వాత మరో 15 గ్రామాల్లో రీసర్వే కొనసాగనుంది.



భూముల రీసర్వే చేస్తున్న బృందం



గణతంత్ర వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ

రేపు గణతంత్ర వేడుకలు

- పోలీసు పెరేడ్ మైదానంలో నిర్వహణ

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 24(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని ఈనెల 26న పోలీస్ పెరేడ్ మైదానంలో కలెక్టర్ షాన్‌మోహన్ జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకల్లో పాల్గొంటున్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో జరిగే గణతంత్ర వేడుకలల్లో జేసీ రాహుల్‌మీనా జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

ఉత్తమ ఉద్యోగి అవార్డులపై కసరత్తు

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉత్తమ ఉద్యోగి అవార్డుల ఎంపికపై కాకినాడ కలెక్టరేట్‌లో కసరత్తు జరుగుతోంది. జిల్లాస్థాయిలో, డివిజన్ స్థాయిలో, మండలస్థాయిలో, గ్రామస్థాయిలో ఉత్తమ సేవలు అందించిన అధికారులను గుర్తిస్తున్నారు. 250మంది నుంచి 300 మంది వరకు ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు అందించే అవకాశం ఉంది. దీనిపైన కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు ఆధ్వర్యంలో గుర్తింపు ప్రక్రియ జరుగుతోంది. ఎంపిక చేసిన ఉద్యోగులకు 26న కాకినాడ పోలీస్ పెరేడ్ మైదానంలో జరిగే గణతంత్ర వేడుకల్లో ఉత్తమ ఉద్యోగి అవార్డులు అందిస్తారు.

బాలికలు ఉన్నత విద్యనభ్యసించేలా ప్రోత్సహించాలి: కలెక్టర్

సర్పవరం జంక్షన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలికలపట్ల జరుగుతున్న వివక్ష, హింసపై అప్రమత్తంగా ఉండాలని, ఉన్నత విద్యాభ్యాసం సాగించేలా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. కాకినాడ రూరల్ వాకలపూడి కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ప్రతిభ కనబరుస్తున్న 30 మంది బాలికలకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బాలికలు ఉన్నత విద్యాభ్యాసం చేయాలన్నారు. పురుషులతోపాటు సమానంగా బాలికలను ఉన్నత విద్య చదివించాలని, కనీసం డిగ్రీ వరకు చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. బాలికల రక్షణకు ప్రభుత్వం అనేక రక్షణ చట్టాలు చేసిందని, లైంగిక వేధింపులకు గురి కాకుండా తక్షణ రక్షణకోసం ప్రత్యేకంగా వాట్సాప్ టోల్ ఫ్రీ నెంబర్ 73311 26044 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోరమండల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు రకాల కమ్యూనిటీ అభివృద్ధి పనులు, బాలికలు, మహిళా సాధికారిత కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు వివరించారు. అనంతరం గొల్లప్రోలు పీహెచ్‌సీ నిర్మాణం కోసం రూ.16లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా బాలికల దినోత్సవం పురస్కరించుకుని రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ఫైనాన్స్ మేనేజర్ కృష్ణ కిషోర్, డీసీవో వెంకట్ పాల్గొన్నారు.



బాలికా సంరక్షణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, కోరమండల్ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు

కాకినాడ జీజీహెచ్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యులు అధికారులు సమష్టిగా పని చేసి ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. కలెక్టరేట్‌లో కాకినాడ జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై వైద్యాధి కారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వివిధ వార్డుల్లో పనిచేస్తున్న వైద్యులు ఇతర సిబ్బంది హాజరు, ఓపీ, మందులు ఇచ్చే కౌంటర్ల దగ్గర రద్దీ లేకుండా చూడడం, వార్డుల్లో నిరంతర పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. జీజీహెచ్‌లోని మౌలిక సదుపాయాలకల్పనకు ప్రభుత్వానికి నివేదిక పంపించడంతోపాటు వివిధ సంస్థల సామాజిక బాధ్యత కింద నిధులు సమకూర్చుకుని జీజీహెచ్ అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విశాఖపట్నం జిల్లాలో నలుమూలలనుంచి నిత్యం అధిక సంఖ్యలో ప్రజలు జీజీహెచ్ ద్వారా వైద్యసేవలు పొందుతున్నందున ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ జిల్లాలో అన్ని అభివృద్ధి కార్యక్రమాల కంటే ఆసుపత్రి అభివృద్ధి ఎంతో ముఖ్యమైనందన్నారు. కాకినాడ ఎంపీ ల్యాండ్స్ నిధులు అత్యధికంగా కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి, డీఎంఅండ్‌హెచ్వో నరసింహనాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

సింగిల్ డెస్క్ విధానంలో పరిశ్రమలకు అనుమతులు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),జనవరి 24(ఆంధ్రజ్యోతి): సింగిల్ డెస్క్ విధానం కింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు జారీచేయాలని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ సర్వేను ఈ నెల 31లోగా పూర్తి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత త్రైమాసికాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 88 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 73పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామని, 14 పరిశీలనలో ఉన్నాయన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహంకోసం పావలావడ్డీ, విద్యుత్, సేల్‌టాక్స్ తదితర రాయితీల కింద జిల్లాలో ఉత్పాదన, సేవా రంగాల్లోని 69 యూనిట్లకు మొత్తం రూ.3కోట్ల57లక్షల రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదం తెలియజేసిందన్నారు. పీఎం విశ్వకర్మపథకంలో నమోదైన దరఖాస్తులను తదుపరి స్టేజ్‌కి సిఫార్సు చేయడంలో విశేష కృషి చేసిన జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం గణపతిని అభినందించారు. పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గవర్నర్ విందుకు ఎంపికైన విద్యార్థికి డీఈవో, ఆర్జేడీ అభినందన

కాకినాడ రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ విందుకు ఎంపికైన తొండంగి మండలం బెండపూడి జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి బలరాం శివను డీఈవో పిల్లి రమేష్, ఆర్జేడీ జి.నాగమణి అభినందించారు. ఆ విద్యార్థి తయారు చేసిన సూర్యుణ్ణి అనుసరించే సౌరపలకలు అనే ప్రాజెక్టుదక్షిణభారత విశ్వేశ్వరయ్య మ్యూజియం వారు పుదుచ్చేరిలో నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థికి గైడ్‌గా వ్యవహరించిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు సత్యశ్రీని, విద్యార్థి బలరాం శివను ఆర్జేడీ, డీఈవోతోపాటు జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్ అభినందించారు.



బలరాం శివ, గైడ్ సత్యశ్రీని అభినందిస్తున్న డీఈవో, అధికారులు

కొబ్బరి.. అధరహో మరి!

పంట పండింది



ఎందుకీ పంట.. ఆ చెట్టు నేను చూడడం.. నా వంక ఆ చెట్టు చూడడం తప్ప లాభం లేదు.. కనీసం నిమ్మకాయలతో కూడా పోటీపడలేక పోతోంది.. ఇదీ నిన్నటి వరకూ కొబ్బరి రైతు ఆవేదన.. ఎందుకంటే నిన్నమొన్నటి వరకూ కొబ్బరికాయ రూ. 10లు దాటిన ఘటనలు లేవు.. అటువంటిది ఒక్కసారిగా రూ.20లు మేర పెరిగిపోయింది.. అంటే వెయ్యి కాయలు రూ.20 వేలు అనమాట.. దీంతో కొబ్బరి పంట పండిందని .. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు..

- వెయ్యి కాయలు రూ. 16000
- రికార్డుస్థాయిలో కొబ్బరి ధరలు
- ఇతర రాష్ట్రాల్లో తగ్గిన దిగుబడి
- ఉభయ జిల్లాల్లో పెరిగిన దిగుబడి
- కుంభమేళాకు కోనసీమ కొబ్బరి
- భారీగా సాగుతున్న ఎగుమతులు



గండేరా వెయ్యి కాయలు రూ.20 వేలు

పచ్చికొబ్బరికాయలు వెయ్యింటికి రూ.16వేలు, కొత్తకాయలో కురిడీలు వెయ్యింటికి గండేరా రకం రూ.19 వేలు, గటగట రకం రూ.16వేలు పలుకుతుంది. కురిడీ కొబ్బరి మార్కెట్‌లో గండేరా రకం వెయ్యికాయలకు రూ.20వేలు పలుకుతుంది. గతంలో ఎన్నడులేదని కొబ్బరిధరలు కొనసాగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

అంబాజీపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కోనసీమ కొబ్బరి మార్కెట్‌కు మంచిరోజులు వచ్చాయి.. ఇప్పటి వరకూ పడుతూ లేస్తూ ఉన్న కొబ్బరి ధర అమాంతం పెరిగిపోయింది. అలా ఇలా కాదు.. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డుస్థాయిలో ధరలు ఉండడంతో ఇటు రైతులు, అటు వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరి పండించే తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడి తగ్గడంతో మన రాష్ట్రంలో కొబ్బరికి డిమాండ్ వచ్చింది.ఈ నేపథ్యంలో కొబ్బరి ధరలు ఊహించని రీతిలో పెరిగాయి.ఎగుమతులు ఊపందుకున్నాయి.ఇతర రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడులు తగ్గాయి.మన రాష్ట్రంలో కొబ్బరి దిగుబడులు పెరగడంతో మార్కెట్ ఊపందుకుంది.

కొబ్బరి రైతులకు తీపి కబురు..

గతంలో ఎకరా కొబ్బరితోటకు 300 నుంచి 400 కొబ్బరికాయలు మాత్రమే దిగుబడి వస్తే ప్రస్తుతం ఎకరాకు 700కు పైగా దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. దీంతో పచ్చికాయకు డిమాండ్ ఏర్పడింది. పాతముక్కుడు కాయను బిహార్, ఒడిషా వంటి రాష్ట్రాలకు భారీగా ఎగుమతులు అవుతున్నాయి.పచ్చికాయ వెయ్యింటికి రూ.15,500 నుంచి రూ.16 వేలు ఉండగా పాతకాయ వెయ్యింటికి రూ.16 వేల నుంచి రూ.16,500 వరకు ధర పలుకుతుంది. అదే గతేడాది సంక్రాంతికి రూ.9 వేలు ఉండగా ప్రస్తుతం ధర పెరుగుదలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మహాశివరాత్రి సందర్భంగా ఆయా రాష్ట్రాలకు రోజు 40కు పైగా లారీలు ఎగుమతులు అవుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్,ఛత్తీస్‌గఢ్,తెలంగాణ రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతున్నాయి.





కుంభమేళాకు కోనసీమ కొబ్బరి

ఉభయగోదావరి జిల్లాల నుంచి 100 నుంచి 120 లారీల వరకు కొబ్బరి ఎగుమతులు జరుగుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి ఆర్డర్లు అధికంగా రావడంతో మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్టు చెబుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కేంద్రంగా జరుగుతున్న మహాకుంభమేళాకు కోనసీమ ప్రాంతం నుంచి కొబ్బరి ఎగుమతులు జరుగుతున్నాయి. కుంభమేళాకు వచ్చే భక్తులు నదీమాతకు కురిడీ కొబ్బరిని వినియోగిస్తున్న నేపథ్యంలో కురిడీ కొబ్బరికి డిమాండ్ ఏర్పడింది. సంక్రాంతి సీజన్ ముగియడంతో పాటు రానున్న మహాశివరాత్రి, శ్రీపంచమి, హోలీ, పెళ్ళిళ్ల సీజన్‌తో కొబ్బరిమార్కెట్‌లో ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని వ్యాపార విశ్లేషకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అటకలపై కొబ్బరి కాయ నిల్వ లేదని , డిమాండ్ తగినంతగా సరఫరా ఉండకపోవచ్చునని వ్యాపారులు వాపోతున్నారు.

మంచు.. ముసుగేసింది..

ఎక్కడ ఉన్నాం.. ఎటెళ్లిపోతున్నాం.. ఊటీలో ఉన్నామా..కొడైకెనాల్‌లో ఉన్నామా.. లేదంటే లంబసింగి వచ్చేశామా.. అన్నట్టు మంచు ముసుగేసింది.. శుక్రవారం ఉదయం 8 గంటలు దాటినా తెలవారలేదు.. సూరీడు బయటకు రాలేదు.. సూరీడు ఎక్కడా అని వెతుక్కోవాల్సి వచ్చింది.. కాసేపటికి కలలా మంచు కరిగిపోయింది.. అప్పుడు తెలిసింది.. మనం గోదావరి జిల్లాలోనే ఉన్నామని.. ఎందుకంటే శుక్రవారం రోడ్లు కూడా కనిపించనంతగా మంచు ముసుగేసింది.. కోనసీమ జిల్లా అంబాజీపేట, మామిడికుదురు, యానాం, అమలాపురం, మండపేట , తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు, చాగల్లు, కాకినాడ జిల్లా తొండంగి, ముమ్మిడివరం మండలాల్లో ఇలా మంచు ముసుగేసింది.


అమలాపురంలో..


మండపేట - తాపేశ్వరం రహదారిలో

ప్రకృతి గీసిన చిత్రం : యానాంలో గోదావరిపై కప్పేసిన పొగమంచు



దారినీ వదల : ఉదయం 8 గంటలకు యానాంలో జాతీయ రహదారిపై ఇలా



దారేది: కాకినాడ నగరంలో ఉదయం పూట కురుస్తున్న మంచు




అమలాపురం/మండపేట/మామిడికుదురు/యానాం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తెలతెల్లవారే వేళ.. పచ్చని అందాలతో చూపరులను మంత్రముగ్ధులను చేసే తూర్పు గోదావరి జిల్లా మంచుపరదాల్లో మరిన్నీ సొబగులు అద్దుకుంది. మంచు తెరల మాటున పల్లెలు కొత్త అందాలను సంతరించుకున్నాయి. శుక్రవారం ఉదయం 9 గంటల తరువాత కూడా మంచు తెరలు తొలగలేదు. దీంతో వాహనాలకు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడ్డారు. శీతాకాలం వచ్చిన తరువాత తొలిసారిగా శుక్రవారం మంచు తెరలు జిల్లాను కమ్మేశాయి. ముందెన్నడూలేని రీతిలో మంచు అనూహ్యంగా కురవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరికొంత మంది మంచు దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో బంధించేందుకు ఆసక్తి కనబరిచారు. మార్నింగ్ వాకింగ్ చేసేవారు ఆహ్లాదకరమైన వాతావరాన్ని ఆస్వాదిస్తు పొగమంచులో సెల్ఫీలు దిగారు. చాలా మంది మంచును ఆస్వాదించారు.. చాలా కాలం తరువాత మంచు ఇంత దట్టంగా కప్పేసిందని. ఇలా చాలా కాలమైందని గత జ్ఞాపకాల్లోకి వెళ్లారు.


మండపేటలో ఇలా..

తప్పని ఇక్కట్లు

ఉదయం 10 గంటల వరకు మంచు కమ్మేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఉష్ణోగ్రతలు కూడా బాగా తగ్గి 18 నుంచి 26 డిగ్రీల వరకు నమోదయ్యాయి. మంచుతో పాటు చలితీవ్రత పెరిగిపోవడంతో అందరూ మంకీ క్యాప్‌లు, జెర్కిన్లు, శాలువాలు ఉపయోగించాల్సిన పరిస్థితి నెలకొంది. వాతావరణం ఒక్కసారిగా మారిపోవడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ముందు రోజు రాత్రి నుంచే చలి తీవ్రత బాగా పెరిగింది. ఉదయం నుంచి కోనసీమ ప్రాంతాన్ని మంచు దుప్పటి కప్పేసింది. గత రెండు నెలలతో పోలిస్తే శుక్రవారం కురిసిన మంచు చాలా ఎక్కువ అని నిపుణులు చెబుతున్నారు. ఈ మంచు బారిన పడితే అనారోగ్యాలకు గురి అవుతారని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మంచు తీవ్ర స్థాయిలో కురవడం వల్ల వ్యవసాయ పంటలతో పాటు ఆక్వారంగానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటిలో ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని వారి ఆందోళన. యానాం నియోజకవర్గాన్ని పొగమంచు కమ్మేసింది. పొగమంచు వల్ల వాహనదారులు ఇబ్బం దులకు గురయ్యారు.


మామిడికుదురులో కప్పేసిన మంచు


ఎన్నాళ్లకెన్నాళ్లకు : మామిడికుదురు గ్రామంలో దారిని కప్పేసిన మంచు

మంచు తెరల మధ్య మహాదేవుడు

మంచు తెరల మధ్య మహదేవుడి విగ్రహం భక్తులకు మహదానందాన్ని కలిగించింది, శుక్రవారం ఉదయం 9 గంటల వరకూ విపరీతమైన మంచుకురిసింది.ఏ కొత్తపల్లి కదంబ క్షేత్రంలో ఉన్న భువనేశ్వరి సహిత విజయేశ్వరుడి ఆలయంతో పాటు అక్కడి కోనేరులో కొలువైన మహదేవుడి విగ్రహం మంచు తెరల మధ్య నయనానందాన్ని కలిగించింది. **- తొండంగి**




చుండ్రు గోవిందరాజు

జాతీయ క్రీడలకు రాష్ట్ర ఒలింపిక్ సంఘ కార్యదర్శిగా గోవిందరాజుకు ఆహ్వానం

- 60 ఏళ్ల క్రీడా ప్రస్థానం

కాకినాడఅర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన వెటరన్ క్రీడాకారుడు, ఒలింపిక్ సంఘ రాష్ట్ర కార్యదర్శి చుండ్రు గోవిందరాజుకు అరుదైన అవకాశం దక్కింది. ఈనెల 27నుంచి ఫిబ్రవరి 14 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ క్రీడల్లో ఒలింపిక్ సంఘ రాష్ట్ర సీఈవో హోదాలో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం మీడియాకు తెలిపారు మండపేటలో జన్మించిన ఆయన 50 ఏళ్లుగా కాకినాడలో నివసిస్తున్నారు. తన 16వ ఏట నుంచి క్రీడా జీవితాన్ని ప్రారంభించిన ఆయన 1969-70లో తొలిసారి ఆంధ్రా యూనివర్సిటీ తరఫున ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. 30 ఏళ్లుగా బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా 10 జాతీయ, ఒక అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని వివిధ పతకాలు సాధించారు. ఒలింపిక్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, సీఈవోగా జాతీయ క్రీడలకు ఈనెల 25న బయలుదేరి వెళుతున్న గోవిందరాజును ఒలింపిక్ సంఘ జిల్లా అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి ఎలీషాబాబు, డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, మాస్టర్స్ అథ్లెటిక్స్ జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి అభినందించారు.

సత్రం గదుల కేటాయింపులో నిబంధనలు పాటించాలి: ఈవో

అన్నవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులకు సత్రంగదుల కేటాయింపులో నిబంధనలు తప్పనిసరిగా పాటించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఈవో సర్క్యులర్ జారీచేశారు. సత్రంగదులవద్ద పనిచేసే సిబ్బంది డ్రెస్‌కోడ్, గుర్తింపుకార్డు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. దళారీవ్యవస్థ అధికంగా ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని జాగ్రత్తగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉద్యోగులపై చర్యలుతప్పవని హెచ్చరించారు.

నాటక రంగాన్ని బతికించుకోవాలి

- ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు
- ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు ప్రారంభం


రాష్ట్రస్థాయి నాటిక పోటీలను ప్రారంభిస్తున్న ముప్పన వీర్రాజు, ప్రముఖ వైద్యుడు లక్ష్మీనారాయణ

పెద్దాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నాటక రంగాన్ని బతికించుకోవాల్సిన అవసరం నేటి సమాజంపై ఎంతైనా ఉందని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, ప్రముఖ వైద్యుడు ఇంధన లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో స్నేహా ఆర్ట్స్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటికల పోటీలను వారు శుక్రవారం ప్రా రంభించి మాట్లాడారు. మంచి సమాజాన్ని నిర్మించుకోవడానికి కళలు, నాటకాలు ఎంతో దోహదపడతాయన్నారు. నాటకం జీవితాన్ని ప్రతిబింబిస్తే, జీవితాన్ని నాటకంగా మన ముందు ఉంచుతుందన్నారు. మానవతా విలువలకు ప్రతిరూపమే నాటకాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జీవన విధానాలను, సామాజిక సంబంధాలను నాటకాలు, కళారూపాల ద్వారా వ్యక్తపరిచాయన్నారు. నాటక పరిషత్‌ను క్రమం తప్పకుండా నిర్వహించాలని వారు నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తిం వెంకట శ్రీనివాసరావు (కోటి), గోపు నారాయణ మూర్తి, స్నేహా ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, ఇంధన బ్రహ్మా నందం, కొత్తిం స్వామినాథన్ దేవాడ పాపేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఖరీదైన జైళ్లు నాటిక

కాళ్లు, చేతులు, కళ్లు, నోరు ఇలా అవయవాలే కాదు, అవి జంతువులకు కూడా ఉంటాయని. జంతువుల నుంచి మనిషిని వేరు చేసేది మనసు మాత్రమే అని, అది దేవుడు మనిషికి మాత్రమే ఇచ్చాడన్న ఇతివృత్తంతో సాగే ఖరీదైన జైళ్లు నాటిక ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు ఈ నాటికను చైతన్య కళాభారతి (కరీంనగర్)వారు ప్రదర్శించ గా, మూలకథను పి.వెంకటేశ్వరరావు రచన చేశారు.

మంచి సందేశాన్నిచ్చిన అనూహ్యం నాటిక

తల్లిదండ్రుల వారసత్వ సంపదను, కష్టార్జితాన్ని కన్న కొడుకులు హక్కుల పేరుతో కుటిల నీతితో వ్యూహాత్మకంగా దక్కించుకోవాలని చూస్తున్నారని, కష్టపడి అభివృద్ధి చెందాల్సిన కొందరు కన్నబిడ్డలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్న ఇతివృత్తంతో ప్రదర్శించిన అనూహ్యం నాటిక ఆహూతులను ఆకట్టుకుంది. తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచనచేయగా కత్తుల మోహనరావు దర్శకత్వం వహించారు.

మన్యం కొండ జాతర ఏర్పాట్లపై సమావేశం

- పొల్లూరు జలపాతంను పరిశీలించిన ఒడిశా, ఆంధ్ర అధికారులు

మోతుగూడెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతంవద్ద మార్చి 3న జరగబోయే మన్యంకొండ జాతరకు ఏర్పాట్లపై ఐటీడీఏ పీవో అపూర్వభరత్ జలపాతంవద్ద ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఒడిశా నుంచి సుమారు 40వేల మంది భక్తులు జాతరకు వస్తారని ఒడిశా అధికారులు తెలపగా గత సంవత్సరం ఒడిశా అధికారులు సీలేరు నదిపై ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏ ర్పాటుచేశారని ఈ సంవత్సరం కూడా ఏర్పాటు చేస్తారని చింతూరు తహసీల్దార్ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి జి.మోహ న్ ఐటీడీఏ పీవోకు తెలిపారు. ఒడిశా, ఆంధ్ర అధికారులు సమష్టిగా పనిచేద్దామని తెలిపారు. కార్యక్రమంలో ఒడిశా రాష్ట్రం కలిమిల తహసీల్దార్ రామకృష్ణ, సత్యరాజ్, మల్కన్‌గిరి తహసీల్దార్ టక్కున పుట్ట, మోటు తహసీల్దార్ ప్రభాస్‌కుమార్ బడ్మెక్, ఏబీడీవో కలిమెలా వసంత్ కుమార్ బొహరా, మల్కన్‌గిరి రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, మోతుగూడెం అధికారులు సాయిబాబా మామ్మో, ఫారెస్ట్ ఎఫ్ఎస్‌వో మోహన్, ఎస్ఐ శివనారాయణ, ఏపీజెన్‌కో సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, ఏడీఈ కొండబాబు పాల్గొన్నారు.


పొల్లూరు జలపాతంను పరిశీలిస్తున్న ఆంధ్ర, ఒడిశా అధికారులు

కష్టాలు.. తీరేదెప్పుడో?


వాడపల్లిలో తిరువీధులలో భక్తుల రద్దీ(ఫైల్)

- వాడపల్లి వెంకన్న ఆలయం వద్ద భక్తులకు ఇక్కట్లు
- రోడ్లపై ఆక్రమణలు.. ఇరువైపులా చిరు వ్యాపారాలు
- ఆలయ తిరువీధుల్లో భక్తులకు తోపులాట కష్టాలు

ఆత్రేయపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన క్షేత్రంగా విరాజిల్లుతోంది. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. కానీ, ఆలయంవద్ద కొన్ని ఇబ్బందులతో భక్తులకు ఇక్కట్లు తప్పడంలేదు. రోడ్డుపై ఆక్రమణలతో తిరువీధుల్లో ఒక్కోసారి తోపులాటలు లాంటి ఘటనలు జరుగుతున్నాయి.

రోడ్డు మీదే వ్యాపారాలతో..

వాడపల్లి ఆలయంలో ప్రతి శనివారం 50వేల మంది భక్తులు ప్రదక్షిణలు నిర్వహించుకుని స్వామిని దర్శించుకుంటున్నారు. ఆలయం డిప్యూటీ కమిషనర్ హోదాస్థాయి పెరిగి రూ.25 కోట్లు వార్షిక ఆదాయానికి చేరుకుంది. అయినా భక్తులకు వసతి, సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. గతంలో టీడీపీ హయాంలో వాడపల్లివద్ద కొత్త వంతెన నిర్మించి పక్కా రహదారులను నిర్మించారు. రవాణా సౌకర్యం మెరుగుపర్చినా భక్తుల ట్రాఫిక్ కష్టా లు పెరిగిపోతున్నాయి. శ్రీనివాస ప్రాంగణంతోపాటు పుష్కరఘాట్‌వద్ద పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ డిపోలనుంచి ఆర్టీసీ ద్వా రా భక్తులు స్వామి సన్నిధికి చేరుకుంటున్నారు. తిరువీధుల్లో భక్తుల ప్రదక్షిణలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ చిరువ్యాపారులు రోడ్డు మీదే వ్యాపారాలు సాగించడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్ ప్ర దేశంనుంచి ఆలయాలకు వెళ్లే రెండు దారులు, తిరువీధుల్లో నాలుగు మార్గాలవద్ద వ్యాపారాలు రోడ్డు మీదే ఏర్పాటు చేయడంతో భక్తులు అష్టకష్టాలు పడుతున్నారు. రాజకీయఒత్తిళ్లతో వ్యాపా రులను ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. రహదారులపై ఇసుక, కంకర గుట్టలను నివాస గృహాల వారు నిల్వ చేసుకున్నారు. పుష్కరఘాట్‌కు వెళ్లే ప్రదేశం ఆక్రమణలతో బక్కచిక్కింది. పుష్కర ఘాట్‌కు వెళ్లే మార్గంవద్ద మటన్, చికెన్‌షాపులు ఏర్పాటు చేయడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తూ ముక్కుమూసుకుని వెళ్తున్నారు. మరి కొన్ని వీధుల్లో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. షాపుల వద్ద భక్తులు గుమిగూడడంతో ప్రదక్షిణ చేసే వారు మండిపడుతున్నారు. అసలే ఇరుకుప్రదేశం.. మరో పక్క రోడ్డు ఆక్రమణలు, భక్తుల రద్దీ పెరిగిపోవడంతో భక్తుల నగదు, బ్యాగులు, సెల్‌ఫోన్లు చోరీలకు గురవుతున్నాయి. భక్తుల ఇబ్బం దులను దేవదా యశాఖ పరిష్కరించాల్సి ఉంది. మెరుగైన సౌకర్యాలతోపాటు స్వామి దర్శనం సకాలంలో జరిగేలా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.


వాడపల్లిలోని వెంకన్న ఆలయానికి పార్కింగ్ ప్రదేశంనుంచి వచ్చే రోడ్డు మార్గం దుకాణాలతో ఆక్రమించిన దృశ్యం


వాడపల్లి పుష్కరఘాట్‌వద్ద స్నానాలు ఆచరించేందుకు వెళ్లే మార్గంవద్ద ఆక్రమణతోపాటు మాంసం దుకాణం విక్రయాలు

బెండపూడి విద్యార్థికి..

గవర్నర్ ఎట్‌హోంకు ఆహ్వానం


ఎట్‌హోంకు ఆహ్వానం పొందిన విద్యార్థి బలరాం శివ

- రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో సోలార్ పలకల ప్రాజెక్టు
- వ్యక్తిగత విభాగంలో ప్రథమస్థానం

తొండంగి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బెండపూడి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి బలరాం శివకు రాష్ట్ర గవర్నర్ కార్యాలయం నుంచి ఎట్‌హోం కార్యక్రమానికి ఆహ్వానం అందింది. రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో బలరాం రూపొందించిన సూర్యుడిని అనుసరించే సోలార్ పలకలు అనే ప్రాజెక్టు వ్యక్తిగత విభాగంలో ప్రథమస్థానాన్ని సాధించింది. ఇది దక్షిణ భారత దేశ విద్యావైజ్ఞానిక విభాగానికి ఎంపికైంది. ఈ నేపథ్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా గవర్నర్ బంగ్లాలో వివిధ రంగాల ప్రముఖులకు ఇచ్చే విందులో శివ పాల్గొనే అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకున్నాడు. ఈనెల 26న రిపబ్లిక్‌డే రోజున సాయంత్రం 4.30 గంటలకు జరిగే విందుకు హాజరు కావాల్సిందిగా గవర్నర్ కార్యాలయం నుంచి ఆహ్వానం అం దడంతో శివకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తొండంగి ఎంఈవోలు షేక్ బాబ్జి, ఎ.సుబ్బిరెడ్డి, బెండపూడి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సాధనాల నూకరాజు, విద్యా కమిటీ సభ్యులు అభినందించారు.

మత్స్య సంపద దోపిడీ


గోదావరి నదిలో వేటాడిన చిన్న చేపలు

- గోదావరిలో అర్ధరాత్రి వలలతో చేపల వేట
- దేవీపట్నం నుంచి టన్నుల కొద్దీ లారీల్లో తరలింపు
- ఇతర ప్రాంతాల నుంచి వచ్చి దౌర్జన్యం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న గిరిజన నిర్వాసితులు
- పట్టించుకోని అధికారులు

దేవీపట్నం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): దేవీపట్నం మండలంలో గోదావరి మత్స్య సంపద దోపిడీ జరుగుతోంది. దీన్ని పట్టించుకునేవారే కరువయ్యారు. మండలంలో కొందరు అక్రమంగా గోదావరిలో చేపలు వేటాడి గండిపోచమ్మ ఆలయం వద్దకు బోట్లపై తీసుకువస్తున్నారు. ఇక్కడినుంచి ట్రాక్టర్‌పై పురుషోత్తపట్నం తరలించి చిన్నచేప ప్యాకింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

ఏజెన్సీ ప్రాంతమైన దేవీపట్నం మండలంలో 44 గ్రామాల పరిధిలో పోలవరం ప్రాజెక్టు ఉన్న కారణంగా ప్రభుత్వ నిబంధనలు అమలులో ఉన్నాయి. అయినా ఇక్కడ సీడు-ఫీడు ధ్వంసం చేస్తూ ధనార్జన కోసం కొందరు అంతరాష్ట్ర వ్యాపారం చేస్తున్నారు. ఇక్కడి గ్రామాల్లో మత్స్యకారులు, గిరిజనులు వేట నియమాలు కలిగి ఉంటారు. ఆయా గ్రామాల్లో జీవనోపాధికి వీరు మాత్రమే వేట సాగించేందుకు అనుమతి ఉంది. దేవీపట్నం మండలం దేవారం, శరభవరం, ఇందుకూరు, ఇందుకూరుపేట, పోతవరం గ్రామపంచాయతీ పరిధిలో మత్స్యకారులు అద్దె ఇళ్లల్లో ఉంటూ తెల్లవారుజామున సంప్రదాయ వేటాడుతూ జీవనం సాగిస్తున్నారు. దీన్ని అదునుగా తీసుకుని కొందరు కొవ్వూరు, రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కాకినాడ, యానాం, నక్కపల్లి తదితర ప్రాంతాలనుంచి వచ్చి మత్స్యశాఖ నియమ, నిబంధనలకు వ్యతిరేకంగా చిన్న కన్నుల వలలతో చీరమేను అలివి వేటాడుతున్నారు. స్థానిక గిరిజనులు, మత్స్యకారులపై దౌర్జన్యం చేసి మరీ ఈ వేట సాగిస్తున్నారని విమర్శలున్నాయి. దీనిపై అధికారులు స్పందించకపోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాత్రి సమయాల్లో వేట

అంతరాష్ట్ర ముఠాలతో స్థానికులు కొంతమంది కుమ్మక్కై ఈ వేట సాగిస్తున్నారని తెలుస్తోంది. అక్కడే గోదావరి పరీవాహక ప్రాంతాల్లో మకాం వేసుకుని రాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా వేట సాగిస్తున్నారు. టన్నుల కొద్దీ చేపలను బోట్లపై గండిపోశమ్మ ఆలయం వద్దకు చేర్చి అక్కడినుంచి ట్రాక్టర్లపై పురుషోత్తపట్నం తరలిస్తున్నారు. అక్కడ ప్యాకింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నట్లు తెలుస్తోంది. సీడు-ఫీడు గోదావరి గట్లపై పారవేస్తూ నదిలో మత్స్య సంపదను ధ్వంసం చేస్తున్నారు. కోట్ల రూపాయిల్లో ఈ వ్యాపారం జరుగుతున్నా మత్స్య సంపదను దోచుకుపోతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


నిబంధనలకు విరుద్ధంగా చేపలను ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం

రిపబ్లిక్ డే వేడుకలకు ఆహ్వానం

- ఢిల్లీకి పయనమైన ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు

కాకినాడ సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానం అందడంతో కాకినాడకు చెందిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు, ఆయన సతీమణి బలసాడి లక్ష్మి శుక్రవారం బయలుదేరి వెళ్లారు. రోడ్డు మార్గం గుండా విశాఖ చేరుకుని అక్కడ మరో ఆరుగురు మత్స్యకార ప్రతినిధులతో కలిసి విమానంలో ఢిల్లీ వెళ్లారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా వీరిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బలసాడి రంగారావు మాట్లాడుతూ కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సహకారంవల్లే తమను ఎంపిక చేశారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.


బలసాడి రంగారావు

మహిళపై హత్యాయత్నం కేసులో

నిందితుడికి తొమ్మిదేళ్లు జైలు శిక్ష

సర్పవరం జంక్షన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహిళను లైంగికంగా వేధించి హత్యాయత్నానికి పాల్పడిన నిందితునికి తొమ్మిది సంవత్సరాల జైలు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు సర్పవరం ఎస్‌హెచ్‌వో బొక్క పెద్దిరాజు తెలిపారు. కాకినాడ రూరల్ మండలం వాకలపూడికి చెందిన ఇరవై అయిదేళ్ల కొరుప్రోలు వెంకన్న స్థానికంగా ఉన్న మహిళను 2022వ సంవత్సరంలో లైంగికంగా వేధించి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో అప్పటి మహిళా ఎస్‌ఐ వి మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారన్నారు. శుక్రవారం ఈ కేసు విషయమై వాదోపవాదనలు అనంతరం నిందితుడు వెంకన్నపై నేరం రుజువు కావడంతో రాజమహేంద్రవరం ఎనిమిదవ జిల్లా సెషన్స్ జడ్జి వై బెన్నయ్యనాయుడు 9 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పునివ్వడం జరిగిందన్నారు. రూ. 7 వేలు జరిమానా విధించడం జరిగిందన్నారు. నిందితునికి కోర్టులో శిక్షపడేలా కృషి చేసిన పీపీ కె రాధాకృష్ణరాజు బలమైన వాదనలు, కోర్టు కానిస్టేబుల్ ఏ దుర్గారావు సాక్షులను సక్రమంగా కోర్టులో ప్రవేశపెట్టడంతో నిందితునికి శిక్ష పడిందన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అనపర్తి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి దేవీచౌక్ సెంటర్ వద్ద గల సామర్లకోట కాలువలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. అనపర్తి అదనపు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం ... బస్టాండ్ సమీపం ఎర్రకాలువలో గుర్తు తెలియని మృతదేహం ఉందన్న సమాచారం తమకు అందిందన్నారు. దీంతో అక్కడికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీయించామన్నారు. సుమారు 45 సంవత్సరాల వయసు కలిగిన పురుషుడిగా గుర్తించామన్నారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉంద న్నారు. మృతుని వద్ద లభించిన దుస్తుల ఆధారంగా పరిసర పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించినట్టు ఆయన చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. మృతుని ఆచూకీ తెలిసినవారు అనపర్తి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడి .. మహిళ అరెస్ట్

రంగంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి వెంకన్నపేటలో శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు సారా స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో పంపన వీరగనిక అనే మహిళ ఐదు లీటర్ల సారా కలిగి ఉన్నట్టు గుర్తించారు. దీంతో సదరు మహిళను అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

గోకవరం పోలీస్ స్టేషన్ ఎదుట ..

పెంటపల్లి గ్రామస్థుల ధర్నా

- రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన యువకుడు
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించి నినాదాలు
- ఓ రాజకీయ నేత అడ్డుకుంటున్నాడని ఆరోపణ...
- ఎమ్మెల్యే నెహ్రూ హామీతో ఆందోళన విరమణ


ధర్నా చేస్తున్న పెంటపల్లి గ్రామస్థులు

గోకవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ పెంటపల్లి గ్రామస్థులు శుక్రవారం గోకవరం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. పెంటపల్లి గ్రామానికి చెందిన సాత్నబోయిన దుర్గాప్రసాద్ (23)అనే యువకుడు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. ఈక్రమంలో ఈనెల 20వ తేదీన సినిమా చూసేందుకు టికెట్ల కోసం గోకవరం వెళ్లాడు. టికెట్లు తీసుకున్న అనంతరం స్నేహితుడిని కూడా సినిమాకు తీసికెళ్లేందుకు మోటారు సైకిల్‌పై బయలు దేరాడు. ఈ నేపథ్యంలో అతను ప్రయా ణిస్తున్న మోటారు సైకిల్ గోకవరం పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చేసరికి రాజమహేంద్రవరం వైపు నుంచి అతి వేగంగా వస్తున్న మరో మోటారు సైకిల్ ఢీకొనడంతో దుర్గాప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించగా, అదేరోజు సాయంత్రం మృతిచెందాడు. ఈ ఘటనపై గోకవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీనికి కారణమైన వ్యక్తిని పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. అయితే మృతుని కుటుంబానికి న్యాయం జరగ కుండా ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు అడ్డుకుంటున్నారంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని ఇంతవరకు ఎందుకు అరెస్ట్ చేయలేదంటూ పోలీసులను ఆందోళనకారులు ప్రశ్నించారు. ఇంతలో స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్దకు విచ్చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను ఆందోళనకారులు కలిసి జరిగిన సంఘటనను వివరించారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషిచేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

హత్య కేసులో .. నిందితుడికి జీవిత ఖైదు

రాజానగరం,జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓ హత్య కేసుకు సంబంధించి నిందితుడికి జీవిత ఖైదు ఖరారైంది. వివరాలివి రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020వ సంవత్స రంలో హత్య కేసు నమోదైంది. ఈ మేరకు నిందితుడికి రాజమహేంద్రవరంలోని 5వ అదనపు కోర్టు జీవిత ఖైదు విధించినట్టు రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ శుక్రవారం తెలిపారు. రాజానగరం మండలం రాధేయపాలేనికి చెందిన తన్నీరు రాంబాబు ఇదే గ్రామానికి చెందిన కొప్పిరెడ్డి వెంకన్నను హత్య చేయగా, తన్నీరు వెంకన్న బాబును గాయపర్చాడు. ఈ మేరకు అప్పటి సీఐ ఎంవీ సుభాస్ పర్యవేక్షణలో ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.

అయితే ఎట్టకేలకు రాజమహేంద్రవరం 5వ అదనపు సెషన్స్ జడ్జి సమగ్ర విచా రణ జరిపిన అనంతరం జడ్జి డబ్బీరి విజయ్‌గౌతమ్ నిందితుడికి నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ. ఐదు వేల జరిమానా విధించారు.

ఈ కేసులో ప్రాసి క్యూషన్ తరపున అప్పటి అదనపు పీపీ శంభుప్రసాద్, పీపీ లక్ష్మణ్ నాయక్ బలమైన వాదనలు వినిపించారు.కోర్టు కానిస్టేబుల్ దుర్గాప్రసాద్ సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టారు.

కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో ..

ఎట్టకేలకు దిద్దుబాటు చర్యలు

- సిబ్బంది నిర్లక్ష్యంపై వచ్చిన ఆరోపణలపై స్పందించిన అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు

కోరుకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో పనిచేస్తున్న సిబ్బంది నిర్లక్ష్యంపై భక్తులు, గ్రామస్థుల నుంచి వస్తున్న ఆరోపణలపై ఎట్టకేలకు అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) పి. సుబ్బారావు స్పందించారు. దీనికి సంబంధించి శుక్రవారం దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఈ మేరకు దశాబ్ద కాలంలో దేవస్థానంలో గుమస్తాగా విధులు నిర్వహిస్తున్న ఆర్.రవికుమార్‌ను ఆయన సొంత స్థానమైన రాజమహేంద్రవరం ఆర్యాపురం సత్యనారాయణ దేవస్థానం నుంచి బదిలీ చేశారు. అదేవిధంగా అన్నవరం దేవస్థానానికి చెందిన పి.వెంకటరమణ ఇప్పటి వరకు కోరుకొండ దేవస్థానం ఇన్‌చార్జిగా కొనసాగుతున్న ఆయన్ని ఇక్కడ నుంచి తిరిగి అన్నవరానికి బదిలీ చేశారు. ఆ స్థానంలో బి. సత్యశ్రీనివాస్, ఆర్.రవికుమార్ స్థానంలో టి.రాంజీని నియమించారు. దీనిపై అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి సుబ్బారావు లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇప్పటివరకు కోరుకొండ దేవస్థానంలో పనిచేస్తున్న రవికుమార్‌ను బదిలీ చేసి అన్నవరం దేవస్థానం నుంచి ఆ స్థానంలో సత్యశ్రీనివాస్, రాంజీను నియమించారు. అయితే అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఇద్దరు ఉద్యోగులను బదిలీ చేసి చేతులు దులుపుకుంటే సరిపోతుందా... అన్న అనుమానం స్థానికుల్లో ఉంది. దీనిపై లోతైన విచారణ జరిపి, చేసిన ఉద్యోగులకు కఠిన శిక్ష అమలు చేస్తేనే దేవస్థానంలో అభివృద్ధి జరుగుతుందని భక్తుల అభిమతం.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో అర్చన

పెద్దాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ దేవ స్థానంలో అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో శుక్రవారం అర్చన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కురం విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేదపండితులు ఈ అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రసాదా లను వితరణ చేశారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

• విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ వేణుగోపాల్



శిక్షణార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పీసా చట్టంద్వారా ఏజెన్సీ ప్రాంతాలలో ప్రభుత్వం అమలుచేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన పెంపొందించేందుకు వివిధ శాఖలలో నిపుణులు రెండు రోజులపాటు అందించిన శిక్షణా తరగతులను పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసు కోవాలని విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ జే.వేణుగోపాల్ పేర్కొ న్నారు. ఏజెన్సీ ప్రాంతాల మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు ఈటీసీ అవరణలో అందిస్తున్న రెండురోజుల శిక్షణా తరగతులను శుక్రవారం సాయంత్రంతో ముగియగా శిక్షణార్థులకు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సర్టిఫికెట్లను అందజేశారు. సామర్లకోట ఈటీసీ ఆవరణలో పీసా చట్టంపై పంచాయతీ కార్యదర్శులకు వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వ హించిన ముగింపు శిక్షణా తరగతులకు ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ వేణుగోపాల్ హాజరయ్యారు. ఐదుజిల్లాలకు చెందిన ఆయా పంచాయతీ కార్యదర్శులు సుమారు 100 మంది హాజరయ్యారు. ఒక్కొక్క బ్యాచ్‌కు 100 మంది పంచాయతీ కార్యదర్శులు చొప్పున రెండురోజులకు ఒక బ్యాచ్ చొప్పున ఫిబ్రవరి 8వరకూ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పేర్కొన్నారు. జాయింట్ డైరెక్టర్ శ్రీదేవి, రమణ, జాయింట్ డైరెక్టర్ రామనాధం, ఫ్యాకల్టీలు శ్రీనివాసరావు, ఎం. చక్రపాణీరావు, నీహారిక, జగదీష్, వి.ప్రసాద్, వి.ఆంజనేయులు, పద్మజ పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు 'ఉపాధి' పనులు కల్పించాలి

• జిల్లా కలెక్టర్‌కు తాటిపాక మధు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతున్న మధు

కాకినాడసిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని, గ్రామీణ ఉపాధి హామీ పనులలో రాజకీయ జోక్యాన్ని నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో వ్యవసాయ పనులు లేనందున వ్యవసాయ కూలీలు పట్టణాలకు వలస పోతున్నారన్నారు. వలసలు నివారించే ప్రయత్నం చేయాలని, ఉపాధి హామీ కూలీలకు రోజువారీ వేతనం రూ 700 మంజూరు చేయాలన్నారు. జాబ్‌కార్డ్‌తో నిమిత్తం లేకుండా అడిగిన ప్రతి ఒక్కరిక ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. అలాగే ఉపాధి హామీలో చేసిన పనికి సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. ఉపాధి హామీ చట్టంలో పని చేసే క్షేత్రస్థాయి సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో రాజకీయ కారణాలతో తీసేసిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మధు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు కేశవరపు అప్పలరాజు, పప్పు ఆదినారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి నక్క శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, రాజు, వర్ధన్ తదితరులున్నారు.

గణతంత్ర వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా జేసీ

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పోలీస్ పెరేడ్ మైదానంలో జరుగుతున్న 76వ గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు, ఆర్డీవో మల్లిబాబు తదితరులు కలిసి పరిశీలించారు. పలు సూచనలు చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరయ్యే గౌరవ ప్రజాప్రతి నిధులు, అధికారులు, జిల్లావాసులు, విద్యార్థులు, మీడియా ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా జేసీ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాల వివరాలతో కూడిన శక టాలు, స్టాల్స్ ఏర్పాటును సకాలంలో పూర్తిచేయాలన్నారు. ఈ పరిశీనలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీనివాసరావు, కాకినాడరూరల్ తహసీల్దార్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కి వెళ్లేందుకు పుట్‌పాత్ బ్రిడ్జి నిర్మించాలి

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వార్ఫ్ రోడ్డులో గల టీబీ వార్డు నుంచి జీజీహెచ్‌లోకి వెళ్లేందుకు ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మించాలని శుక్రవారం ఓ ప్రకటనలో కాకినాడ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు కోరారు. ఆసుపత్రి వెనకాల ఉన్న టీబీ వార్డులోకి వెళ్లే సమయంలో రద్దీగా ఉన్న రహదారిలో వాహనాల రాకపోకలతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణ కోసం రోగులు,సహాయకులకు ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా ఆస్పత్రిలోకి వెళ్లేందుకు ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మిస్తే ఉపయోగంగా ఉంటుందన్నారు.

బాలికల హక్కులు కాపాడటం అందరి బాధ్యత

తాళ్లరేవు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బాలిక హక్కులను కాపాడే బాధ్యత అందరిపైనా ఉందని బీమాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు వాసంశెట్టి నందివర్ధన అన్నారు. శుక్రవారం చొల్లంగిపేట అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మజ అధ్యక్షతన బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, భద్రతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలికలపై ఉన్న వివక్షతను అంతమొందించి సమాజంలో సమాన అవకాశాలను కల్పించాలని నందివర్ధన అన్నారు.

సీహెచ్‌సీ ఆసుపత్రికి ఏసీ అందజేత

సామర్లకోట, జనవరి 24: (ఆంధ్రజ్యోతి):సామర్లకోట ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు పెద్దాపురం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జి వి. వెంకటరమణ సౌజన్యంతో సమకూర్చిన ఎయిర్‌కండీషనర్‌ను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చేతులమీదుగా శుక్రవారం డాక్టర్ అమలకు అందజేసారు.

నిర్మలా సీతారామన్‌ను కలిసిన ఎంపీ సతీష్‌బాబు



నిర్మలా సీతారామన్‌ను మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవిందును కలిసిన చంద్రబాబు, సతీష్‌బాబు

కాకినాడసిటీ, జనవరి 24 (ఆంధ్ర జ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు హాజరయ్యారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ దేశాల ఆర్థిక సదస్సుకు హాజరై స్వదేశానికి తిరిగివచ్చిన చంద్రబాబు శుక్రవారం ఉదయం ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌కు వెళ్లారు. అక్కడ ఆర్థికశాఖ మంత్రి కార్యాలయంలో నిర్మలా సీతారామన్‌ను కలిశారు. ఆయన వెంట రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఉన్నారు. ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రితో భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావలసిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల విషయమై ప్రస్తావించినట్లు సమాచారం. దావోస్ పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన పెట్టుబడుల గురించి సీఎం చంద్రబాబు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించినట్లు తెలిసింది. అనంతరం భారత మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవిందును సీఎం చంద్రబాబు, రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు కలిశారు.

మూడో రోజూ జేఈఈ మెయిన్స్ 2025 పరీక్షలు

కాకినాడ రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎన్టీఏ ద్వారా నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు మూడో రోజు శుక్రవారం కాకినాడలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లలో ప్రశాంతంగా జరిగాయి. కాకినాడలోని అచ్యుతాపురం రైల్వే గేటు సమీపంలోని ఐయాన్ డిజిటల్ జోన్, రూరల్‌లోని రాయుడుపాలెంలోగల సాఫ్ట్ టెక్నాలజీస్‌లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 వరకూ , 3గంటల నుంచి సాయంత్రం 6 వరకూ ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఐయాన్ డిజిటల్ జోన్ కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 466 మంది హాజరు కావాల్సి ఉండగా 460 మంది విద్యార్థులు హాజరయ్యారని 6గురు పరీక్ష రాయలేదని కేంద్రం ప్రతినిధి తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 467 మంది హాజరు కావాల్సి ఉండగా 465 మంది హాజరయ్యారని ఇద్దరు పరీక్ష రాయలేదని శనివారం కూడా పరీక్షలు కొనసాగుతాయన్నారు.

ఆకట్టుకున్న క్రెడాయి ఎక్స్‌పో



క్రెడాయి ఎక్స్‌పో ప్రారంభిస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సొంతింటి కలను సాకారం చేసుకునే వారంతా తప్పక క్రెడాయి కాకినాడశాఖ ఏర్పాటుచేసిన ప్రాపర్టీ షోను తిలకించి వారి కలల సౌధం నిర్మించుకోవాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కౌడ చైర్మన్ తుమ్మల రామస్వామి పేర్కొన్నారు. కాకినాడ ఎస్ఆర్ ఎంటి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం కాకినాడ క్రెడాయి శాఖ ఆదర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న క్రెడాయి ప్రాపర్టీ షో ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. క్రెడాయి కాకినాడశాఖ చైర్మన్ నెక్కంటి శ్రీనివాస్ స్వాగతం పలికారు. క్రెడాయి కాకినాడ ప్రెసిడెంట్ విజయకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యే, కౌడ చైర్మన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ప్రాపర్టీ షో ప్రారంభించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను చూపించి వాటి వివరాలు తెలిపారు.

రెండో రోజూ కొనసాగిన సదస్సు

కాకినాడ రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ కళాశాల్లో అంతర్జాతీయ మహిళా నాయకత్వ కాంక్లేవ్‌పై నిర్వహిస్తున్న సదస్సు రెండో రోజూ కొనసాగింది. ఈసంర్భంగా ముఖ్యఅతిధి కాకినాడ మున్సిపల్ కమీషనర్ భావన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు అన్నిరంగాల్లోనూ ముందంజలో ఉండాలని అప్పుడే దేశాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. డ్వాక్రా మహిళల విజయగాధలు గూర్చి పద్మావతి వివరించారు. ఎమ్మెల్సీ పద్మశ్రీ మాట్లాడుతూ మహిళలు రాజకీయ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను ఏవిధంగా అదిగమించాలో వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న కాకినాడ మున్సిపల్ కమీషనర్ భావన

కొనసాగుతున్న సంగీత విద్వత్సభ

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 24(ఆంధ్రజ్యోతి): సంగీత విద్వత్సభ కాకినాడ వారి ఆధ్వర్యంలో సూర్యకళా మందిరంలో సంక్రాంతి గానసభల పదిరోజుల కార్యక్రమాల్లో ఆరవరోజు కార్యక్రమంగా యూపీ రాజు, యు.నాగమణి, మాండలిన్ దంపతులకు ఘనంగా సత్కరించారు. వారిరువురికి సంగీత విద్వన్మణి బిరుదుతో సత్కరించి సంగీత విద్వత్సభ గౌరవించింది. వారు వారి కుమారులు మాస్టర్ జయ విగ్నేశ్‌తో కలిసి మాండలిన్ కచేరి అత్యద్భుతంగా చేశారు. వీరికి మృదంగంపై పారుపల్లి ఫల్గుణ్, విజయవాడ, ఘటంపై జి.హరి బాబు, గుంటూరు వారప చక్కటి సహకారాన్ని అందించారు. నారాయణం మురళి, పేపకాయల రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు. డాక్టర్ ముళ్లపూడి నాగేశ్వరరావు, డాక్టర్ ఎస్‌పీ రావు, వక్కలంక రామకృష్ణ, గట్టి శ్రీకృష్ణదేవరాయలు, చావలి సూర్యకుమారి, జి.సత్య, ఎం.పద్మ, సంగీత విద్వాంసులు, అధిక సంఖ్యలో సంగీత ప్రియులు హాజరయ్యారు. డాక్టర్ ముళ్లపూడి నాగేశ్వరరావు సౌజన్యంతో జరిగింది.

పశువుల సంత అభివృద్ధికి రూ.1.35కోట్లు

• జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి



పశువుల సంతను పరిశీలిస్తున్న జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి

పిఠాపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పశువుల సంతను రూ.1.35 కోట్లతో ఆధునికీకరించనున్నట్లు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సంతను ఆధునికీకరించి రైతులకు అన్నిరకాల సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎన్నికల సమయంలోనూ, విజయం అనంతరం పిఠాపురంలో నిర్వహించిన బహిరంగసభలో ప్రకటించారు. పవన్ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం పశువుల సంత చుట్టూ ప్రహరీ నిర్మాణంతోపాటు ర్యాంపులు, పశువుల తాగు నీటి సదుపాయం, రైతులు వేచి ఉండేందుకు వీలుగా షెడ్ల నిర్మాణం తదితర పనుల నిర్వహణకు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టే పనులపై మర్రెడ్డి శుక్రవారం పిఠాపురం మునిసిపల్ కమిషనర్ కనకారావు, పంచాయతీరాజ్ డీఈఈ సిద్ది వెంకటేశ్వరరావులతో కలిసి పరిశీలన జరిపారు. పనులు త్వరితగతిన నాణ్యతతో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ ఉన్నారు.

ప్రతీఒక్కరూ విద్యను నేర్చుకోవాలి

కొత్తపల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ తప్పని సరిగా చదవు నేర్చుకోవాలని ఉల్లాస్ ప్రాజెక్ట్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. ఉప్పాడ మత్స్యకార సమాఖ్యలో శుక్రవారం నిర్వహించిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాశ్యులను అక్షరాశ్యులుగా తీర్చిదిద్దేందుకు సమావేశం జరిగింది.మత్స్యకారసమాఖ్యలో సంఘానికి 10 మంది చొప్పున అక్షరాశ్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిర్వహిస్తుందని ఏపీఎం కె తౌడు తెలిపారు. గ్రామసంఘాల అధ్యక్షులు, వీఓలు పాల్గొన్నారు.

ఎస్‌పీఎఫ్ కమాండెంట్ పూజలు

పిఠాపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాన్ని రాజమహేంద్రవరం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కమాండెంట్ కె.నరసింహరావు సందర్శించారు.. సతీసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు పి.విజయజనార్ధనాచార్యులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు అందించారు.

బాలికలు అన్నిరంగాల్లో ముందుండాలి

పిఠాపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అన్నిరంగాల్లో బాలికలు ముందుండాలని, ఇందుకు ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సాహం అందజేస్తోందని ఇందిరానగర్ అర్బన్‌హెల్త్ సెం టర్ వైద్యాధికారి డాక్టర్ జయరాం తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మునిసిపల్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాల జోలికి వెళ్లవద్దని, సూచించారు.

'ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి'

కాకినాడ క్రైం, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : రోడ్డుప్రమాదాల నివారణ కోసం ప్రతీ ఒక్కరూ హెల్మెట్ విధిగా ధరించాలని, సైబర్ నేరాల నియంత్రణ కోసం అవగాహన తప్పనిసరని కాకినాడ ట్రాఫిక్ సీఐ రమేష్ కోరారు. ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక స్థానిక సాలిపేట బాలిక హైస్కూల్లో రోడ్డు ప్రమాదాల నివారణ,ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

హమాలీల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

సామర్లకోట, జనవరి 24: (ఆంధ్రజ్యోతి): హమాలీల ఆరోగ్య పరిరక్షణకు కోరమాండల్ సంస్థ కృషిచేస్తుందని ఆ సంస్థ డివిజినల్ బిజినెస్ హెడ్ కె.ఎస్ఆర్ చక్రవర్తి పేర్కొన్నారు. సామర్లకోట నవభారత్ చక్కెర కర్మాగార ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్యశిబిరాన్ని చక్రవర్తి ప్రారంభించారు. సుమారు 300 మంది హమాలీలకు అమలాపురం కిమ్స్ ఆసుపత్రి వైద్యబృందంచే ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

సామర్లకోట, జనవరి 24: (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణంలో మఠం సెంటర్ తదితర ప్రాంతాలలో ప్రభుత్వ నిధులు బీపీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణపు పనులను సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య శుక్రవారం సాయంత్రం పరిశీలిం చారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదేశాల మేరకు అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు ఏమాత్రం తగ్గకుండా ఉండేందుకు గాను మున్సిపల్ అధికార యంత్రాంగం ప్రత్యేక నిఘా వేస్తుందని కమీషనర్ చెప్పారు.

ఓటర్లను వ్యక్తిగతంగా కలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉభయ గోదావరి జిల్లాల పరిశీలకుడు చిరంజీవిరావు

గొల్లప్రోలు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఓటరును స్వయంగా కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ, ఉభయగోదావరిజిల్లాల ఎన్నికల పరిశీలకుడు వేపాడ చిరంజీవిరావు సూచించారు. గొల్లప్రోలు పట్టణ శివారులోని అతిథిగృహంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అధ్యక్షతన శుక్రవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చిరంజీవిరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమా లు, ఉద్యోగాల కల్పనకు తీసుకుంటున్న చర్యలను వివరించి ప్రతిఒక్కరి మద్దతు కోరాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల్లో తన కు అండగా నిలిచి గెలిపించాలని కోరారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏడువేల మంది ఎమ్మెల్సీ ఓటర్లు ఉన్నారని, వారందరి వివరాలను బూ త్ కన్వీనర్లకు అందజేయాలన్నారు. సమావేశంలో టీడీపీ సమన్వయకమిటీ సభ్యులు, పట్టణ, మండల కమిటీల అధ్యక్షులు క్లస్టర్ ఇన్‌చార్జిలు, ఎమ్మెల్సీ బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

పెద్దాపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. స్థానిక సుధా కాలనీలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల విధివిధానాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని శుక్రవారం మాట్లాడారు. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో జరిగిన జరిగిన నష్టం కంటే వైసీపీ పాలనలో రాష్ట్రానికి ఎక్కువగా నష్టం వాటిల్లిందన్నారు. అనంతరం ఎన్నికల విధివిధానాలపై ఎన్నికల పరిశీలకుడు వేపాడ

సమావేశంలో పరిశీలకుడు చిరంజీవిరావు

చిరంజీవి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు, అడబాల కుమారస్వామి, రంధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేరాబత్తులకు 12 సంఘాల మద్దతు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు ఉపాధ్యాయ, అధ్యాపక, ఉద్యోగ, పోస్టల్, కార్మిక, విశ్రాంత ఉద్యోగుల సంఘాలు, ఎస్‌టీయూ, పీఆర్‌టీయూ, పండిత్ పరిషత్, హెచ్ఎంఎస్‌సీఆర్పీ, వెలుగు టీచర్స్ అసోసియేషన్, యంగ్‌మెన్స్ అసోసియేషన్, చేయూత ఫౌండేషన్, హిందూ యూఎస్, ఆర్‌యూపీపీ, రాష్ట్రీయ ఉపాధ్యాయ పరిషత్, ఎస్‌టీఏ, టీఎన్‌యూఎస్, పీడీలు, పీఈటీల సంఘాలు మద్దతు తెలిపాయి. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు వేపాడ చిరంజీవిరావు, కూటమి అభ్యర్థి పేరాబత్తుల ఆయా సంఘాల ప్రతినిధులతో కలిసి శుక్రవారం రాత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి విద్యాభివృద్ధికి సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విశేష కృషి చేస్తున్నారన్నారు. అందువల్ల కూటమి బలపరిచిన రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఓటర్ల దినోత్సవం పండుగలా నిర్వహించాలి

• అర్బన్ తహశీల్దార్ జితేంద్ర

కాకినాడ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ సెంటర్‌లో మానవహారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాకినాడ అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర తెలిపారు. శనివారం ఉదయం 8.30 కు మానవహారం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభిస్తారన్నారు. అక్కడి నుంచి కాలినడకన కుళాయిచెరువు ఆవరణలోని స్మార్ట్ సిటీ సమా వేశపు హాలుకు చేరుకుంటారన్నారు ఉదయం 11గంటలకు జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం ఓ పండుగలా జరుగుతుందన్నారు. 18సంవత్సరాలు నిండిన యువ ఓటర్లు, సీనియర్ ఓటర్లు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొననున్నారన్నారు. ప్రజలకు, ఓటర్లకు ఓటు విలువ తెలిపేందుకు భారత ఎన్నికల సంఘం 2011 నుంచి ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. యువత దేశ రాజకీయల్లో నిమగ్నం అయ్యేలా చూడాలనేది కార్యక్రమం ముఖ్యఉద్దేశమని అర్బన్ తహసీల్దార్ జితేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఓటరు దినోత్సవ ర్యాలీ

కార్పొరేషన్(కాకినాడ): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 7గంటల నుంచి భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరిస్తూ ప్రజల్లో ఓటు చైతన్యాన్ని కలిగించనున్నారు. ఈ ర్యాలీ శనివారం ఉదయం 7గంటల నుంచి జిల్లా పరిషత్ సెంటర్‌లో ప్రారంభమై.. కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయం వరకు సాగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ నగరపాలక సంస్థలోని సిబ్బందితో సమావేశమయ్యారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి, పారిశుధ్య పనుల తనిఖీల్లో భాగంగా కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన శుక్రవారం తెల్లవారుజాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. నగరంలోని రామారావుపేట, నాగేశ్వరరావువీధి, చీడిలపొర మెయిన్‌డ్రెయిన్, ఉప్పుటేరును పరిశీలించారు. ఆ డ్రెయిన్‌ను ఎలా శుభ్రపరుస్తున్నది అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి దుమ్ములపేట చేరుకున్న కమిషనర్ భావన అక్కడ గార్బేజ్ కలెక్షన్ ఎక్స్‌లేటర్‌ను పరిశీలించారు. మరమ్మతుకుగురైన ఎక్స్‌లేటర్ పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు.

ప్రజ్ఞ వికాస పరీక్షలు విజయవంతం చేయాలి

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 24(ఆంధ్రజ్యోతి): భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజ్ఞవికాస పరీక్షను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో జిల్లా విద్యా శాఖ అధికారి రమేష్ పోస్టర్ విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ప్రతి పోటీపరీక్షకు 10వ తరగతి కీలకమని అటువంటి పదో తరగతి పరీక్షలను విద్యార్థులందరూ ఏకాగ్రతతో చదవాలన్నారు. ఇప్పటివరకు చదివిన వాటిని రివిజన్ చేసుకోవడానికి సహకారానికి ఈపరీక్షలు ఉపయోగపడతాయన్నారు. గత 15సంవత్సరాల నుంచి ఈపరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 21మండలాల్లో నిర్వహిస్తు న్నామన్నారు. ఈపరీక్షల్లో గెలుపొందిన విద్యార్థుల కు వివిధ స్థాయిల్లో బహుమతులు అందిస్తామ న్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి 5000, ద్వితీయ బహుమతి 3000,తృతీయ బహుమతి 2000, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ జిల్లా నాయ కులు వాసుదేవ్, సాయిత్, జైరాం, సంతోష్ పాల్గొన్నారు.

గోదాము యజమాని నుంచి సొమ్ము రికవరీ

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 24(ఆంధ్రజ్యోతి): కరప మండలం కొరిపల్లిలో త్రీసీజన్స్ లాజిస్టిక్స్ బియ్యం గోదాము యజమాని నుంచి సొమ్ము రికవరీ చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా తెలిపారు. తొమ్మిదేళ్లలో 632 మెట్రిక్ టన్నులు తరుగుని గోదాంలో గుర్తించామన్నారు. టన్నుకు రూ.92వేలు చొప్పున రూ.5కోట్ల 82లక్షలు రికవరీ చేయాల్సి ఉందన్నారు. గోదాము యజమానికి స్టోరేజీ చార్జీలు నిమిత్తం రూ.కోటీ 35లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. అవి మినహాయించి మిగిలిన రూ.4కోట్ల49లక్షలు ఆయన ప్రభుత్వానికి చెల్లించాలని ఆదేశించామన్నారు. ఈ నివేదికను పౌరసరఫరా సంస్థ ఎండీకి పంపించామన్నారు.

ఘనంగా పళ్లంరాజు జన్మదిన వేడుకలు

ప్రత్తిపాడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో శుక్రవారం మాజీ కేంద్రమంత్రి ఎంఎం పళ్లంరాజు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పీసీసీ సభ్యుడు దర్నాల కోట శ్రీను ఆధ్వర్యంలో పళ్లంరాజు జన్మదిన వేడుకలు పురస్కరించుకుని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు కందిమళ్ళ శామ్యూల్, ఈరుగుల చక్రం, ఏనుగుపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



హాస్పటల్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ తదితరులు

ప్రాథమిక హాస్పటల్ స్థలం పరిశీలన

మోతుగూడెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో శుక్రవారం ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ ప్రాథమిక హాస్పటల్ స్థలాన్ని పరిశీలించారు. ఏపీ జెన్‌కో సివిల్ అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్‌తో ఆయన మాట్లాడారు. మోతుగూడెంలో బస్ షెల్టర్ లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో రెవెన్యూ భూమి ఎక్కడ ఉందో తెలుసుకుని తహశీల్దార్ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి మోహన్‌తో పరిశీలించారు. ఆయనతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఘనంగా జాతీయ బాలల దినోత్సవం

మోతుగూడెం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ బాలల దినోత్సవాన్ని జరిపారు. మోతుగూడెం పంచాయతీ కార్యదర్శి జి.మోహన్ ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకేటి సీత, ఆయుర్వేద డాక్టర్ మహమ్మద్ రఫీ, హెచ్ఎం శాంసన్, ఉపాధ్యాయులు సుజాత, సన్యాసిరావు, అంగన్‌వాడీ టీచర్ వి.జయశ్రీ, కనక మహా లక్ష్మికుమారి, కిరణకుమారి, మోతుగూడెం గ్రామస్తులతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా పాఠశాల నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ జరిపారు. డొంకరాయి గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లు కరకా జయకుమారి, చింతల నాగమణి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్ బాలికలతో జాతీయ బాలికల దినోత్సవం జరిపారు. అనంతరం ఎన్టీఆర్ భవన్ నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీటీసీ కరకా వెంకటరమణ, ఎస్ఐ శివకుమార్, ఉపసర్పంచ్ నాగ్ జయదాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణ, ఎస్ఐ శివకుమార్ పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో సింధువాడ, అంగన్‌వాడీ టీచర్ మితుల, మహిళా పోలీసు బేబి, ఆశవర్కర్ సావిత్రి, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దహనం

కూనవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దహనమైంది. గ్రామానికి చెందిన బల్లెం రమణయ్య ఇల్లు ఈ ఘటనలో బూడిదైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఇది జరిగినట్టు తెలుస్తున్నది. ఈ ప్రమాదంలో రూ.3లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించింది. వీఆర్వో అంజి పంచనామా నివేదికను అధికారులకు అందించారు.



అగ్నికి ఆహుతైన ఇల్లు



అడ్డతీగలలో బాలికల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

చింతూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చదువుతో పాటు క్రీడలు, రచనలు తదితర రంగాలలో రాణించాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం చింతూరు జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని జరిపారు. ఐసీడీఎస్ నేతృత్వంలో బాలికలకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు పీవో బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థినులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో బహుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి విజయగౌరి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆటల పోటీలు

అడ్డతీగల: అడ్డతీగల ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని సీడీపీవో వై.సుధ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆటల పోటీలు, వ్యాస రచన వంటి పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. అనంతరం బాలల దినోత్సవంపై ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతిమతి, ఐసీడీయస్ సిబ్బంది పావని, వీరయమ్మ, స్వర్ణ, బ్లాక్ కోఆర్డినేటర్ రవిరాజా తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలో వివిధ బాలికల పాఠశాలల్లో జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరిపారు. సీడీపీవో ఎల్.దేవమణి ఆధ్వర్యంలో రాజవొమ్మంగి జడ్పీ హైస్కూల్‌లో సింగంపల్లి, జడ్డంగి ఆశ్రమ బాలికల పాఠశాలల్లో నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.అరుణలత, ఎస్.నాగజయలక్ష్మి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు, మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



చింతూరులో విజేతలకు బహుమతులు అందిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పేరాబత్తులకు విజయానికి కృషి చేయాలి

ఎమ్మెల్యే సత్యప్రభ, ఎమ్మెల్సీ రాపాక చిరంజీవిరావు పిలుపు



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ చిరంజీవిరావు

ప్రత్తిపాడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఉభయగోదావరి జిల్లాల పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ రాపాక చిరంజీవిరావు పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు 4962మంది ఉండగా, వీరంతా పేరాబత్తులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా కూటమి నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 7నెలల కూటమి పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. పోలవరం, అమరావతిఅభివృద్ధికి కేంద్రం నిధులు విడుదలకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. తొలుత దివంగత టీడీపీ నేత వరుపుల రాజా విగ్రహానికి ఎమ్మెల్సీ చిరంజీవిరావు పూలమాలవేసి నివాళులర్పించారు. నియోజకవర్గ టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, పర్వత సురేష్, ఇతంశెట్టి భాస్కరబాబు, బదిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి, పైలా సాంబశివరావు, యాళ్ళ జగదీష్, బద్ది రామారావు, వెలుగుల నాని, దాట్ల అప్పన్నబాబు, బసవ ప్రసాద్, బొల్లు వెంకటేశ్వరరావు, పోలిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ఒమ్మంగి, ధర్మవరం జట్ల ప్రతిభ



ప్రథమ స్థానంలో నిలిచిన ఒమ్మంగి జట్టుకు షీల్డ్, నగదు, గోల్డ్ మెడల్ అందజేసిన మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో నాలుగు రోజులు నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. సంక్రాంతి సంబరాలు ముగింపు సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 34కబడ్డీ జట్లు పాల్గొన్నాయి. ఒమ్మంగి కబడ్డీ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ జట్టుకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణరాజు గోల్డ్‌మెడల్, షీల్డ్, రూ.10వేలు అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన ధర్మవరం జట్టుకు సిల్వర్ మెడల్, షీల్డ్, రూ.7వేలు నగదును, తృతీయ స్థానంలో నిలిచిన గజ్జనపూడి జట్టుకు బ్రౌన్ మెడల్, షీల్డ్, రూ.5వేలు మురళీరాజు అందజేశారు. బెస్ట్ రైడర్‌గా ఒమ్మంగి నరేష్, బెస్ట్ డిపెండర్‌గా ధర్మవరం సీహెచ్ సాయి, బెస్ట్ ఆల్ రౌండర్‌గా ధర్మవరం కొల్లుబోయిన విష్ణుకు మురళీరాజుబహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పల్లా రాజబాబు, ముదునూరి సీతారామరాజు, జువ్వల బాబులు, నానిపల్లి చంటి, బొల్లు చిట్టిబాబు, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, బొల్లు నాగేశ్వరరావు, బొండు రాజబాబు, కిల్లాడి బాబ్జి, కోన బాబ్జి, సిద్ద అప్పలరాజు, దాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు. అనంతరం ధర్మవరం కబడ్డీ జట్టుకు ప్రత్యేకంగా ఎంఎంఆర్ ట్రస్టు ప్రతినిధులు క్రీడా దుస్తులు, సామగ్రి అందజేశారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కోటనందూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఈనెల20 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన స్వచ్ఛాంధ్ర సాధ్యమేనా అనేవార్తకు జిల్లా అధికారులు స్పందించారు. కోటనందూరు మెయిన్ రోడ్డుపై మురుగునీరు ప్రవహించి ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండంతో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.10లక్షలతో శుక్రవారం మాజీ ఎంపీపీ డి.చిరంజీవిరాజు ఆధ్వర్యంలో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలో ఉపాధి నిధులతో రూ.10లక్షలతో రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత వెలగా వెంకటకృష్ణారావు, చింతకాయల రవికుమార్, బిసత్యనారాయణ, లగుడు సత్యనారాయణమూర్తి, పి.లోవరాజు, చందక శ్రీను, పల్లా రామకృష్ణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం







ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు, తుని: వి.కొత్తూరు కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శన, గండేపల్లి: : మురారిలో బాలికా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గండేపల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం మురారి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో గండేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కేవీ నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ కోసం బాలికలకు సాధికారత అనే థీమ్ గురించి వివరించారు. ముఖ్యఅతిథిగా పెద్దాపురం డిప్యూడీ డీఎంహెచ్ఓ డాక్టర్ పి.సరిత హాజరై ఆడపిల్లలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్ ఎన్‌వీఎస్‌బీఆర్ శర్మ, హెచ్ఎం ఎ.అమ్మాజీ, పీహెచ్ఎన్ బి.రుతమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ ఎ.చెల్లారావు, హెచ్‌వి పి.ఈశ్వరమ్మ, ఎంఎల్‌హెచ్‌పీజీ ఉషారాణి, ఏఎన్ఎం సంపూర్ణ దుర్గ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు. సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మెడికోవర్ గైనకాలజీ వైద్యురాలు డాక్టర్ ప్రదీపిక హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సతీష్‌కుమార్, స్టాఫ్ సభ్యులు సుజియ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పరిణయశ్రీ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

ఏలేశ్వరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇంచార్జ్ ప్రగడ ప్రయాగమూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ప్రయాగమూర్తి మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న అవమానాలు, అసమానతలను రూపు మాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. డిగ్రీ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు మీదగా బాలాజీ చౌక్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. విద్య, ఆరోగ్యం, బాలికల హక్కులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సునీత, రామారావు, బంగారాజు, పుష్ప, మేరీ, సతీష్ పాల్గొన్నారు.

కేజీబీవీలో దినోత్సవం

తుని రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వి.కొత్తూరు కేజీబీవీ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని పాఠశాల ఎస్‌వో అమృతవాణి అధ్యక్షతన నిర్వహించారు. బాలికల సంరక్షణ హక్కులు, ఆరోగ్యం, విద్యా, సామాజిక ఎదుగుదల తదితర అంశాలపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చేపట్టిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి

కార్యకర్తలకు అండగా ఉంటాం

రౌతులపూడి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలకు ముద్రగడ కుటుంబం అండగా ఉంటుందని వైసీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ ముద్రగడ గిరి అన్నారు. శుక్రవారం మాజీ మంత్రి, తండ్రి ముద్రగడ పద్మనాభంతో కలిసి మూలగపూడిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మా కుటుంబాన్ని తరతరాలుగా రాజకీయంగా ఆదరిస్తున్న రౌతులపూడి మండలం కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. మాజీ సర్పంచ్ అంకంరెడ్డి సతీష్‌కుమార్, మండల కోఆప్షన్ చింతకాయల సత్యనారాయణ, వైసీపీ రాష్ట్ర యువజన నాయకులు వాసిరెడ్డి జేమీలు, జడ్పీటీసీ గోల్లు చినదివాణం పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

ఏలేశ్వరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెద్దనాపల్లి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి శుక్రవారం ప్రారంభించారు. రైతులకు అదనపు ఆదాయం తెచ్చిపెట్టే పాడి పరిశ్రమకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని బుజ్జి అన్నారు. పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, టీకాలు వేశారు. సర్పంచ్ బుద్ద సూర్యప్రకాశరావు, సుంకర సత్తిబాబు, బుద్ద ఈశ్వరరావు పాల్గొన్నారు.

వనదుర్గ ఆలయంలో చండీహోమం



అన్నవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణ, మూలమంత్ర జపాలు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలతో పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూర్ణాహుతి కార్యక్రమంలో ఈవో సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై యమధర్మరాజు వేషధారణతో అవగాహన



యమధర్మరాజు వేషధారణతో అవగాహన

జగ్గంపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట సర్కిల్ పరిధిలోని బ్లాక్‌స్పాట్స్ వద్ద యమధర్మరాజు వేషధారణతో వాహనదారులకు అవగాహన కల్పించినట్లు సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకుండా, హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్ రూట్లో ప్రయాణం చేయడం, ఎవరైతే నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతారో వారందరూ నాకు ఇష్టం అంటూ యమధర్మరాజు వేషధారి జగ్గంపేట సర్కిల్‌లోని అన్ని ఎన్‌హెచ్16లోని బ్లాక్‌స్పాట్స్ వద్ద హల్‌చల్ చేశాడు. రోడ్డు భద్రతా నియమాలు పాటించపోతే నేను మీ దగ్గరకు వస్తానని యమధర్మరాజు హెచ్చరించాడు.

పారదర్శకంగా రేషన్ డీలర్ల ఎంపికలు

రంపచోడవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో 34 రేషన్ డీలర్ల ఎంపికకు ఇంటర్వ్యూలు పారదర్శకంగా నిర్వహించామని సబ్ కలెక్టర్ కే.ఆర్.కల్పశ్రీ తెలిపారు. శుక్రవారం ఆమె కమిటీ సభ్యులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 308 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 305 మంది రాత పరీక్షకు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డీఈవో వై.మల్లేశ్వరరావు, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, సీడీపీవో సంధ్యారాణి, మండల విద్యాశాఖాధికారి ఎం.రామకృష్ణ, ఏఎస్‌వో విజయభాస్కర్ పాల్గొన్నారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మితే చర్యలు

రంపచోడవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయ చాంబరులో మాట్లాడుతూ మెడికల్ షాపుల్లో పెయిన్ కిల్లర్స్, యాంటీ బయోటిక్ మందులు అమ్మిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఉత్తమ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా రామకృష్ణ

రంపచోడవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఉత్తమ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా రంపచోడవరం తహశీల్దారు పి.రామకృష్ణ ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నుంచి విజయవాడలో నేడు జరిగే ఓటర్ల దినోత్సవ అవార్డు ప్రాధాన్య కార్యక్రమానికి హాజరవ్వాలని ఆహ్వానం అందింది.

గిరిజన గ్రామాల్లో ఫీవర్ సర్వే

రంపచోడవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కార్యాలయ చాంబరులో క్షేత్రస్థాయి ఆరోగ్య సేవల పుస్తకాన్ని ఆశ కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, ఏపీవో(జీ) డీఎన్‌వీ రమణ, ఈఈ ఐ.శ్రీనివాసరావు, డీపీఎం అపర్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎటపాక, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వలస ఆదివాసీ గ్రామంలోని విద్య, వైద్యం, తాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని సీఐ ఎం.కన్నపరాజు, ఎస్ఐ అప్పలరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఎటపాక పోలీసులు కొండగట్టు వలస ఆదివాసీ గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలోని వలస ఆదివాసీలతో మాట్లాడారు. గ్రామంలోని సమస్యల వివరాలు తెలుసుకున్నారు. మావోయిస్టులకు ఆకర్షితులు కాకుండా దూరంగా ఉండాలన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

శంఖవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే సమయంలో రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని కాకినాడ ఆర్టీవో శివారెడ్డి, కత్తిపూడి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు బి.శ్రీనివాస్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కత్తిపూడి కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించారు. కత్తిపూడి రెండు జాతీయరహదారుల కూడలి కావడంతో మరింత జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు సాయిబాబు, అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు పాల్గొన్నారు.

ఫాగింగ్ యంత్రం వితరణ

తొండంగి,జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఒంటిమామిడి గ్రామ పంచాయతీకి స్థానిక దివిస్ లేబొరేటరీస్ సంస్థ ఫాగింగ్ యంత్రాన్ని వితరణగా ఇచ్చింది. శుక్రవారం ఒంటిమామిడిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ అంగులూరి సుధాకర్‌కు సంస్థ ప్రతినిధులు వాసుబాబు తదితరులు అందించారు. దివిస్ సంస్థకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సతీష్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ విజన్ కళ్లజోళ్లు అందజేత

తుని రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గురు కంటి చూపులేని అంధులకు రూ.94,500 విలువైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే మూడు స్మార్ట్ విజన్ కళ్లజోళ్లు ఉచితంగా అందజేశారు. పరిసరాలను గుర్తించడం, చదువుకోవడం ఎలా, చాలా అవసరాలకు కళ్లజోళ్లు ఉపయోగపడుతుందని క్లబ్‌సభ్యులు తెలిపారు. తుని రోటరీ క్లబ్, డిస్ట్రిక్ గ్రౌండ్స్ నుంచి కళ్లజోళ్లకు నిధులు సమకూర్చారన్నారు. కార్యక్రమంలో తుని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ మంగరాజు, కె.గౌరీశంకర్, సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ బాలికా దినోత్సవం



మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

జగ్గంపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జాతీయ బాలికల దినోత్సవం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీడీపీవో పూర్ణిమ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి లక్ష్యం ఉండాలని, లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. బాలికలు విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆకతాయిలు బాలలను లైంగిక వేధింపులకు గురిచేసినా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు సమాచారం తెలిస్తే చైల్డ్‌లైన్ 1098 లేదా పోలీసు 112కి ఫోను చేసి సమాచారం అందజేయాలన్నారు. జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు సీఐ శ్రీనివాస్, వందన యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పులి ప్రసాద్, ఏపీఎం ప్రశాంతి, పీహెచ్ డాక్టర్ శ్రీరామ్, పీహెచ్ లక్ష్మీ కాంతం, సీహెచ్‌సీ ఎ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు బ్రాంచ్ ప్రారంభం



జగ్గంపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు విశాఖట్నం రీజియన్‌లో 71వ బ్రాంచ్‌ను జగ్గంపేటలోని గోకవరం రోడ్డులో ఏర్పాటు చేసింది. శుక్రవారం బ్రాంచ్ మేనేజర్ ఎస్.రాగమల్లిక అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి విశాఖపట్నం రీజనల్ సీనియర్ మేనేజర్ బిజయ్‌కేతన్ సాహు హాజరై బ్రాంచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో విశాఖపట్నం రీజియన్ చీఫ్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, రీజియన్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి.శివరామకృష్ణ, క్లరికల్ యూనియన్ జనరల్ సెక్రటరీ ఉమామహేశ్వరరావు, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రాజమండ్రికి చెందిన వివిధ బ్రాంచ్ మేనేజర్లు, ప్రముఖులు కొత్త వీరభద్రరావు(శివ), కొత్త కొండబాబు, మానేపల్లి శివ, ముమ్మిడివరపు సురేష్, ఖాతాదారులు పాల్గొన్నారు.